# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో సమావేశం
- పాల్గొన్న అదనపు కలెక్టర్, డీఎంహెచ్‌వో, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక.. చిత్రంలో పక్కన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఎంహెచ్‌వో

రంగారెడ్డి, జూలై 5 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్యారోగ్య అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ వర్షాల కారణం గా సంభవించే సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, విషజ్వరాలు, మెదడువాపు వంటి వాటి ని అరికట్టేందుకు వైద్యారోగ్యశాఖ సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పట్టణాలు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే ఆయిల్‌బాల్స్ వేయాలని, దో మలు రాకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రతిరోజూ జ్వరాలపై నివేదిక సమర్పించాలని, ఏదైనా ఓ ప్రాంతంలో జ్వరం కేసులు నమోదైతే ఎక్కువ దృష్టి కేంద్రీకరించి తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డేగా నిర్వహించాలన్నారు. డెంగీ జ్వరాలు రాకుండా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా కేసులు నమోదైతే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖకు ఆయన సూ చించారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, కేజీబీవీ విద్యాలయాలు, మోడల్ పాఠశాలలను నిరంతరం సందర్శిం చి విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించాలని ఆదేశించారు. విద్యార్థులు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధు లు, వ్యక్తిగత పరిశుభ్రతపై సైన్స్ టీచర్ల ద్వారా అవగాహన కల్పిం చా లని డీఈవోకు సూచించారు. గ్రా మాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయ తీ ప్రత్యేకాధికారులు తగు చర్యలు చేపట్టాలని..మున్సిపాలిటీ ల్లో వైద్యారోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయం తో సీజనల్ వ్యాధులను అరికట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, సంబంధి త శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

వజ్రోత్సవ(75 వ) వన మహోత్సవ కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వన మహోత్సవంపై అదన పు కలెక్టర్ ప్రతిమాసింగ్, అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపాలిటీ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 75 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ వన మహోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నదన్నారు. 2024 సీజన్‌లో ఆయా శాఖల వారీగా వనమహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ లు, గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ పొలాల గట్లపైన 82.5 లక్షల మొక్కలను లక్ష్యానికి అనుగుణంగా నాటాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందున విరివిగా మొక్కలు నాటాలని, జియో ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు, కాలు వ కట్టలపైనా పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వాటి సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న మూడు వారాల్లోపు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా వందశాతం మొక్కలు నాటించాలన్నారు. వనమహోత్సవ ప్రగతిపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించడంతోపాటు, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా కార్యక్రమాలను రూపొందించిన సమయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను ఆహ్వానించాలని, గ్రామీణ ప్రాంతాల్లో మం డల ప్రత్యేక అధికారులను భాగస్వాములు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఎఫ్‌వో సుధాకర్‌రెడ్డి, పీడీ డీఆర్డీఏ శ్రీలత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా అధికారు లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చిత్రంలో పక్కన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్**

వికారాబాద్, జూలై 5 : జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చే యాలని రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్టేట్ చాంబర్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఆస్పత్రి, వైద్యకళాశాల నిర్మాణాల పనుల పురోగతిపై కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..దవాఖాన, కళాశాలకు అవసరమైన పనులను త్వరగా చేపట్టాలని.. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, ఆర్‌అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్, మిషన్ భగీరథ ఈఈ బాబూశ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఈఈలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సెక్రటరీ డాక్టర్ శరత్


# విద్యార్థులకు మంచి భోజనం అందించాలి

**గిరిజన సంక్షేమ సెక్రటరీ డాక్టర్ శరత్**

వికారాబాద్, జూలై 5 : గురుకుల ఆశ్రమ, గిరిజన హాస్టళ్లలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి భోజనం అందించాలని గిరిజన సంక్షేమ సెక్రటరీ డాక్టర్ శరత్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో గురుకులాలు, గిరిజన హాస్టళ్ల అధికారులతో మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు రాసి జాబితాలో పేర్లు ఉన్న పిల్లలకు మొదటి ప్రాధాన్యమిచ్చి అడ్మిషన్లు ఇవ్వాలని.. వేకెన్సీ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో క్లస్టర్లవారీగా వంట పనివారిని గుర్తించి శిక్షణ ఇవ్వాలని.. పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. హాస్టళ్లలో కనీస సౌకర్యాలుండేలా చూడాలని, ఎక్కడా తాగునీటి రావొద్దని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం తగదన్నారు. భోజనం విషయంలో రాజీపడొద్దని.. సన్న బియ్యం సరఫరా అయ్యేలా సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించి అనుకున్న సమయంలో అందించాలన్నారు. హాస్టల్, గురుకులాల్లో ఎన్‌ఎస్‌ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని.. ఆర్‌సీవో స్కూళ్ల వారీగా రిజిస్టర్ పెట్టి వ్యాధుల బారిన పడిన పిల్లల పేర్లను నమోదు చేయాలన్నారు. అనంతరం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, బోధన అందిస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, హేమలత, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి మల్లేశం, గిరిజన సంక్షేమ హాస్టల్ వార్డెన్లు, ప్రి న్సిపాళ్లు, ఆర్‌సీవో సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను విస్మరిస్తే ఊరుకోం

**డీసీసీ ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

షాబాద్, జూలై 5 : ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ కార్యకర్తలను విస్మరిస్తే ఊరుకునేది లేదని డీసీసీ ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన నాయకులను పక్కనపెడితే సహించేది లేదన్నారు. బీఆర్‌ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడలు పోవడం సరైంది కాదన్నారు. ఇటీవల మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పార్టీ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెన్నయ్య, పెంటారెడ్డి, చెన్నయ్య, పామెన నర్సింహులు, రవీందర్, అక్తర్‌పాషా, అస్మత్‌పాషా, మల్లేశ్, నర్సింహులు, శ్రీరాంరెడ్డి, రవి పాల్గొన్నారు.

# బొగ్గు బావుల వేలాన్ని రద్దు చేయాలి

**కలెక్టరేట్ ఎదుట కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా**


ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

రంగారెడ్డి, జూలై 5(నమస్తే తెలంగాణ) :బొగ్గు బావుల వేలాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఆయా కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలానికి పెట్టడాన్ని తెలంగాణ కార్మిక వర్గం తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. రాష్ట్రంలోని బొగ్గు బావులన్నింటినీ సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కేంద్రంతో పోరాడాలని వారు కోరారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాల్‌రెడ్డి

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

తాండూరు, జూలై 5 : తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా పట్లోళ్ల బాల్‌రాజ్ (బాల్‌రెడ్డి), వైస్ చైర్మన్‌గా నర్సిరెడ్డి నియమితులయ్యారు. డైరెక్టర్లుగా అజ్మత్‌అలీ, జర్నప్ప, తులసీరాం, కరీం, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, నర్సింహాగౌడ్, మొగులయ్య, బిస్మిల్లాబీ, శ్రీనివాస్, రాజు, భోజిరెడ్డి, మాణిక్యం నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు.





అధ్యాపకుల హాజరును పరిశీలిస్తున్న ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్

# ప్రభుత్వ కళాశాలల్లో ఉచితంగా ఇంటర్ విద్య

పెద్దేముల్, జూలై 5 : ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తున్నామని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసి అధ్యాపకుల హాజరుశాతం, అడ్మిషన్లు, గెస్ట్ ఫ్యాకల్టీ వివరాలు, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో 12 ప్రభుత్వ కళాశాలలుండగా కొత్తగా మరో మూడింటిని బషీరాబాద్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో ఏర్పాటు చేశామన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికిగాను 1200 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ నియామానికి సోమవారం నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, అకాడమిక్ పుస్తకాలతో ప్రతి విద్యార్థికీ అర్థమయ్యేలా బోధించాలన్నారు. 100% ఉత్తీర్ణతకు కృషి చేయాలని, నీట్, ఎంసెట్ క్లాసులు తీసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తీర్ణతాశాతంలో వికారాబాద్ జిల్లా ఫస్టియర్‌లో 22 స్థానంలో, సెకండియర్‌లో 27వ స్థానంలో ఉన్నదని.. 66% ఉత్తీర్ణతతో వికారాబాద్ జూనియర్ కళాశాల నంబర్ వన్ స్థానంలో , 15%తో మోమిన్‌పేట కళాశాల చివరిస్థానంలో ఉందన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులతోపాటు తాండూరు కళాశాలలో ఒకేషనల్ కోర్సులు ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీఎస్‌సీ, సీటీ, ఏఅండ్‌టీ, మర్పల్లిలో ఏఅండ్‌టీ, బషీరాబాద్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, బొంరాస్‌పేట్‌లో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో ఇంటర్ విద్య కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహులు, లైబ్రేరియన్ కృష్ణయ్య, సిబ్బంది రమేశ్, జమీల్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పటిష్టంగా పంచాయతీ వ్యవస్థ


జనగాం గ్రామంలోని క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నేషనల్ అకాడమిక్ ఆఫ్ ఆడిట్ అండ్ అకౌంట్స్-సిమ్లా డైరెక్టర్ డాక్టర్ నందలాల్ దాస్, డిప్యూటీ అకౌంట్స్ జనరల్ డాక్టర్ సంజయ్‌రావు, ట్రైనీ ఏజీడీలు పియూష్ రాయ్, బాలకృష్ణ

పెద్దేముల్, జూలై 5 : రాష్ట్రంలో స్థానిక సంస్థల ద్వారా గ్రామ పంచాయతీ వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తున్నదని నేషనల్ అకాడమిక్ ఆఫ్ ఆడిట్ అండ్ అకౌంట్స్-సిమ్లా డైరెక్టర్ డాక్టర్ నందలాల్‌దాస్, డిప్యూటీ అకౌంట్స్ జనరల్ డాక్టర్ సంజయ్‌రావు, ట్రైనీ ఏజీడీలు పియూష్ రాయ్, బాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని జనగాం గ్రామాన్ని జనరల్ ఏజీ ఆడిట్‌లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వ్యవస్థ, సర్పంచ్, పాలకమండలి పనితీరు, గ్రామ సభలు, కార్యక్రమాలు, అభివృద్ధి పనుల రూపకల్పన, పంచాయతీలో నిర్వహించే వివిధ రకాల రికార్డులను పరిశీలించి పలు అంశాలను తాండూరు డీఎల్పీవో శం కర్‌నాయక్, మండల ఎంపీవో రమేశ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని వన నర్సరీ, పల్లెప్రకృతివనం, కంపోస్టుషెడ్, క్రీడా ప్రాంగణం, పాఠశాల పరిసరాలు, మిషన్ భగీరథ నీటి ట్యాంక్ పనితీరును పరిశీలించి చాలా బాగున్నదని మెచ్చుకున్నారు. పంచాయతీ రికార్డుల్లో భాగంగా క్యాష్‌బుక్, ఎంబీలు, ఓచర్లు, బిల్లులు తదితర 35 రకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నందలాల్‌దాస్, సంజయ్‌రావు మాట్లాడుతూ తెలంగాణలోని పంచాయతీ వ్యవస్థ పనితీరు చాలా పటిష్టంగా ఉన్నదని.. నిర్వహిస్తున్న వివిధ రకాల రికార్డులు పకడ్బందీగా ఉన్నాయన్నారు. అనంతరం గ్రామానికి వచ్చిన అధికారుల బృందాన్ని స్థానిక అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాండూరు డీఎల్పీవో శంకర్‌నాయక్, ఎంపీవో రమేశ్‌కుమార్, సీనియర్ ఆడిటర్లు శేఖర్, గౌతమ్ కుమార్, రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## సదరమ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్, జూలై 5 : దివ్యాంగులు సదరమ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. జూలై 6 (శనివారం) 11.00 గంటలకు సదరమ్ క్యాంపు స్లాట్ల బుక్కింగ్ ఉంటుందని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్లాట్లు బుక్ చేసుకున్న వారు ఈ నెల 12, 23, 24, 30, 31 తేదీల్లో తాండూరు ప్రభుత్వ దవాఖానలో నిర్వహించే క్యాంపులకు వారు హాజరు కావాలన్నారు. ఈ నెల 09, 16, 19, 25 తేదీల్లో వికారాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో నిర్వహించే క్యాంపులకు అంగ వైకల్యం, అంధులు రావాలన్నారు. సదరం సర్టిఫికెట్ ఇదివరకు పొంది, సర్టిఫికెట్ కాలపరిమితి దాటిపోయిన వారితోపాటు కొత్తగా స్లాట్ బుక్ చేసు కొన్న వారు హాజరు కావాలన్నారు. 650 స్లాట్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

## సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల్లో.. ఖాళీలన్నింటినీ చూపించాలి

**పీఆర్టీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి**

రంగారెడ్డి, జూలై 5 (నమస్తే తెలంగాణ) : ఎన్నో ఏండ్ల తర్వాత రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న టీచర్ల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పీఆర్టీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తారి రాజిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో విద్యాశాఖ అధికారులను కోరారు. జిల్లాలో సుమారు 2,200 మంది ఎస్జీటీలకు స్థానచలనం కలుగనున్నదని, స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో జరిగినట్లుగా పొరపాట్లు జరుగనివ్వొద్దన్నారు. ఎస్జీటీలు 2000 పైగా ఆప్షన్లు ఇవ్వాల్సి ఉన్నందున తగినంత సమయం ఇవ్వాలన్నారు. రాత్రిపూట వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇవ్వడంవల్ల ఇంటర్నెట్ సౌకర్యంలో అంతరాయం కలిగి గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధ్యాయులకు తీవ్ర అసౌకర్యంగా కలుగుతున్నదన్నారు. ఉదయం పూట వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇవ్వాలని, 500 మంది ఉపాధ్యాయులకు ఒకసారి చొప్పున వెబ్ ఆప్షన్లకు అవకాశమిస్తే ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

# జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

- రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బీజేవైఎం ధర్నా
- ఆ కార్యాలయం ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు


రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన

రంగారెడ్డి, జూలై 5 (నమస్తే తెలంగాణ) : నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శుక్రవారం బీజేవైఎం నేతలు కదం తొక్కారు. రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఒకరోజు ముందుగానే ధర్నాకు పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తు అరెస్టులకు పూనుకున్నారు. కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో పాల్గొనేందుకు ఇబ్రహీంపట్నం, చేవెళ్ల తదితర ప్రాంతాల నుంచి వస్తున్న నేతలను అరెస్టు చేశారు. అయినప్పటికీ బీజేవైఎం నేతలు అధిక సంఖ్యలో రంగారెడ్డి కలెక్టరేట్‌కు చేరుకు న్నారు. కలెక్టరేట్ ముట్టడికి నేతలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ఆ గేటు వద్ద రోడ్డుపై బైఠాయించి గంటకు పైగా ఆందోళన చేశారు.

### ఏడు నెలలు గడిచినా..

నిరుద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అనుసరిస్తున్నదని ధర్నాలో పా ల్గొన్న నేతలు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయకపోవడం విడ్డూరమని విమర్శించారు. మేనిఫెస్టోలో చెప్పినట్లు రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, గ్రూప్-1 మెయిన్స్‌కు 1:50 కాకుండా 1:100 పద్ధతిన పిలవాలని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని వేయాలని నేతలు డిమాండ్ చేశారు. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను పెంచి మరోసారి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు లచ్చిరెడ్డి, ప్రతాప్, దయానంద్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ శ్రీశైలం, దిలీప్‌గౌడ్, పాండు, యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఏబీవీపీ నాయకుల ధర్నా

వికారాబాద్ : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ వికారాబాద్ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.7,200 కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి మధ్యతరగతి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి మహేశ్, ప్రధాన కార్యదర్శులు ఆదికేశవ్, రాజేందర్, మురళి, కార్తీ క్, సంజు, నరేందర్, అక్షిత్, హరికృష్ణ , దయాకర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్‌లో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

### ముందస్తు అరెస్టులు సరికాదు..

ఇబ్రహీంపట్నం : టీజీపీఎస్సీ ముట్టడికి వెళ్తారనే సమాచారంతో బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగాల నాయకులను ముందస్తు అరెస్టు చేయడం తగదని బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు, విద్యార్థి నాయకులు శివసాయి, మండల పార్టీ అధ్యక్షుడు బుగ్గరాములు, మాజీ ఎంపీటీసీ భరత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ యువజన, విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఠాణాలకు తరలించడంపై వారు మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. అక్రమ అరెస్టులతో విద్యార్థులు, నిరుద్యోగుల ఉద్యమాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆపలేదన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్‌గౌడ్, వినోద్, గణేశ్ గౌడ్, బాలు తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం : బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసి ఠాణాకు తరలించిన పోలీసులు